
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.0
కనిష్ఠం 24.0
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 18 జూలై 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	560.70 (234.0796)	65,522	1,800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.34 (3.53)	-	139.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.017 (18.2313)	-	5,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి

● రోజురోజుకూ పెరుగుతున్న ధర

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)



అల్పాహారమైనా, ఆహారమైనా అన్నింట్లో తప్పనిసరి కావాల్సింది పచ్చిమిర్చి. విటమిన్లు, ఖనిజాలు, యాంటి ఆక్సిడెంట్లతో కూడి ఆహారానికి కారపు రుచిని జోడించే పచ్చి మిరపకాయలు సామాన్యుల కంట తడి పెట్టిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడంతో పచ్చిమిర్చి ధర మండిపోతోంది. సాధారణ రకమైన పచ్చి మిర్చి కిలో రూ.100 ఉండగా ప్రత్యేక మిర్చీ ధర రూ.120కి చేరింది.

సరఫరా తగ్గడంతోనే..

పచ్చి మిర్చి ధర రూ.10కి పావుకిలో అంటేనే ఎక్కువ అనిపిస్తుంది. పక్షం రోజుల క్రితం కిలో ధర రూ.50 నుంచి రూ.60 ఉండగా, ప్రస్తుతం సెంచరీ కొట్టింది. అలాంటిది పావుకిలో పాతిక రూపాయలు దాటగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనేందుకు వెనుకాడుతున్నారు. అయితే దిగుబడి తగ్గిన కారణంగానే ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. స్థానికంగా మిర్చి పంట లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతోనే ధరలు పెరిగాయంటున్నారు. రాయలసీమలోని కర్నూలు, సమీప ప్రాంతాలనుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని, కిలో ధర హోల్‌సేల్‌గానే రూ.70 నుంచి రూ.77 వరకూ - మిగతా 8వ పేజీలో...

పరిషత్ ఎన్నికలపైనే.. నజర్



● ఏర్పాట్లలో పంచాయతీరాజ్ శాఖ ● రిజర్వేషన్లకోసం రాజకీయ నాయకుల ఎదురుచూపు ● ఇప్పటికే ప్రాథమిక ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మొదటగా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు మొదలైంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఇప్పటికే ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్లు సైతం ఖరారు చేయడంతోపాటు పోలింగ్ సిబ్బందిని సైతం గుర్తించి శిక్షణ ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

పార్టీలపరంగానే ఈ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో అందుకు అవసరమైన పోలింగ్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలను సైతం అందుబాటులో ఉంచుకున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారుచేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన మరుక్షణం ఎన్నికల నిర్వహణలోకి దిగేందుకు వీలుగా పంచాయతీరాజ్‌శాఖ సన్నద్ధమయింది. మరోవైపు అధికార కాంగ్రెస్‌తోపాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు సైతం రిజర్వేషన్లపై ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 33 జడ్పీటీసీ, 33 ఎంపీపీ, 353 ఎంపీటీసీ స్థానాలు

రాష్ట్రంలోనే పెద్ద జిల్లా అయిన నల్లగొండలో 33 మండల పరిషత్‌లతోపాటు, 33 జడ్పీటీసీ స్థానాలు, 353 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా 2016లో నూతనంగా అడవిదేవులపల్లి, కొండమల్లేపల్లి, మాడుగులపల్లి, నేరేడుగొమ్ము, తిరుమలగిరి (సాగర్) మండల పరిషత్‌లు ఏర్పాటయ్యాయి., 2019 పరిషత్ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా వీటిని కలుపుకొని 31 జడ్పీటీసీ స్థానాలు, 31 మండల పరిషత్‌లతోపాటు, 352 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజాగా గట్టుప్పల్, గుడిపల్లి మండలాలు ఏర్పాటు కాగా, తాజాగా ఈమండలాలను కలుపుకొని 33 జడ్పీటీసీ స్థానాలు, 33 మండల పరిషత్‌లలో 353 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. అత్యధికంగా మిర్యాలగూడ మండల పరిషత్‌లో 19 ఎంపీటీసీ స్థానాలుండగా, అత్యల్పంగా అడవిదేవులపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి మండలాల్లో అయిదేసి చొప్పున ఎంపీటీసీ స్థానాలున్నాయి.

రిజర్వేషన్ల కోసం నాయకుల నిరీక్షణ

పరిషత్ ఎన్నికలకు అధికారయంత్రాంగం సన్నద్ధమవుతుండగా, రాజకీయనాయకులు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఈ ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే ప్రయత్నాలు చేపట్టడంతో ఆర్డినెన్స్ వచ్చిన తక్షణమే రిజర్వేషన్ల కోటా, స్థానాలు ఖరారు చేసేందుకు పంచాయతీరాజ్‌శాఖ సిద్ధమయింది. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయనుండగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. అదేవిధంగా మండలం యూనిట్‌గా ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయిస్తారు. జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్ల కోటాను - మిగతా 8వ పేజీలో...

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
1.అడవిదేవులపల్లి	05	7,395	7,376	0	14,771
2.అనుముల	08	10,779	11,414	1	22,194
3.చందంపేట	09	16,008	15,083	1	31,092
4.చండూరు	08	12,118	12,201	0	24,319
5.చింతపల్లి	14	22,570	22,732	2	45,304
6.చిట్యాల	12	17,905	18,074	0	35,979
7.దామరచర్ల	14	20,212	20,767	3	40,982
8.దేవరకొండ	11	17,937	17,797	1	35,735
9.గట్టుప్పల్	05	7,883	7,825	0	15,708
10.గుడిపల్లి	05	6,175	6,278	0	12,453
11.గుండ్లపల్లి	13	21,407	21,531	2	42,940
12.గుర్రంపోడు	12	19,137	19,785	2	38,924
13.కనగల్	12	18,202	18,484	0	36,686
14.కట్టంగూరు	13	18,696	18,943	0	37,639
15. కేతేపల్లి	11	15,218	16,042	1	31,261
16. కొండమల్లేపల్లి	09	15,129	14,706	3	29,838
17.మాడుగులపల్లి	10	14,867	15,751	0	30,618
18.మర్రిగూడ	10	15,215	15,632	0	30,847
19.మిర్యాలగూడ	19	27,488	28,467	7	55,962
20.మునుగోడు	13	18,959	19,030	0	37,989
21.నకిరేకల్	9	13,280	13,576	2	26,858
22.నల్లగొండ	13	19,183	20,067	0	39,250
23.నాంపల్లి	11	17,846	18,453	1	36,300
24.నార్కట్‌పల్లి	15	21,621	22,359	1	43,981
25.నేరేడుగొమ్ము	6	10,173	9,769	3	19,945
26.నిడమనూరు	13	17,635	18,682	1	36,318
27.పీఏపల్లి	10	13,940	13,845	6	27,791
28.పెద్దవూర	11	16,889	17,507	8	34,404
29.శాలిగౌరారం	13	20,200	20,652	3	40,855
30.తిప్పర్తి	9	13,529	14,227	0	27,756
31.తిరుమలగిరిసాగర్	11	17,603	17,848	3	35,454
32.త్రిపురారం	12	18,087	18,857	4	36,948
33.వేములపల్లి	07	10,047	10,669	0	20,716
మొత్తం	353	5,33,333	5,44,429	55	10,77,817

ఎండుతున్న పంటలకు జీవం

● ఉమ్మడి నల్లగొండలో అత్యధికంగా 6.4సెంటీమీటర్ల వర్షం



నల్లగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం కురిసిన వర్షం ఎండలకు వాడిపోతున్న పత్తి, కంది పంటలకు ఈ వర్షం జీవం పోసినట్లయ్యింది. వర్షాలు లేక ఎరువులు వేయక పోవడంతో మెట్ట పంటల ఎదుగుదల ఆగిపోయి వాడిపోతున్నాయి. ఈ దశలో వర్షం కురియడంతో రైతులు ఆనందపడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగామలో అత్యధికంగా 6.4సెంటీమీటర్లు, సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఆరు సెంటీమీటర్లు, నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరులో 4.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

హాస్టళ్లలో ముఖ ఆధారిత హాజరు

● ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే కఠిన చర్యలు ● కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో ఫేస్ రికగ్నైషన్ హాజరును అమలు చేస్తామని, వార్డెన్లు ఫేస్ రికగ్నైషన్ యాప్‌లో హాజరుకాకుంటే వారి జీతాన్ని నిలిపివేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జి ల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ఉదయాదిత్య భవన్‌లో అన్ని సంక్షేమ శాఖల అధికారులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే సంబంధిత ఉ ద్యోగులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని అన్ని హాస్టళ్లను సందర్శించి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని హాస్టళ్లలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎంలు తప్పనిసరిగా జాబ్ చార్ట్ నిర్వహించాలని, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే సంబంధిత హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్, సంబంధిత రీజనల్ కో-ఆర్డినేటర్లపై కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి, అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పు ట్ల శ్రీనివాస్, ఆయా సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, డీఈవో భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలుచేయాలి

అడవిదేవులపల్లి, దామరచర్ల: పేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరగకుండా పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల్లో గురువారం ఆమె పర్యటించారు. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాలకు సమయానుకూలంగా రావాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల ప రిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అడవిదేవులపల్లి మండల కేం ద్రానికి చేరువలో ఉన్న టెయిల్ పాండ్‌ను పరిశీలించి నీటి నిల్వ గురించి అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారి, గృహనిర్మాణ శాఖల అ ధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ప్రభుత్వం నిబంధనల మేరకు కొలతల ప్రకారం నిర్మించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమాల్లో ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీసీవో పత్యానాయక్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్లు రాగ్యానాయక్, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

హైవేపై అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటు



కేతేపల్లిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలు

కేతేపల్లి, జూలై 17(ఆంధ్ర జ్యోతి): కేతేపల్లి మండల కేంద్రంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికార్డెడ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే వాహనాలను గుర్తించడంలో ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమించడానికి జిల్లాలోని పెద్దవూర, మాడ్గులపల్లి, కేతేపల్లి మండల కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఆధునిక సాంకేతికత కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచనల మేరకు ప్రమాదాల కేంద్రంగా మారిన కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ వద్ద గల జంక్షన్‌లో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కెమెరాకు రూ.50వేల కంటే ఎక్కువే ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కెమెరాలు జాతీయ రహదారులపై చిమ్మచీకట్లో సైతం 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లే వాహనాలను నెంబర్‌తో సహా గుర్తించగలుగుతాయని కేతేపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు. హైదరాబాద్-విజయవాడల మధ్య గల ఈహైవేకు ఇరువైపులా ఒక్కో కెమెరాను అమర్చి వాటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మిర్యాలగూడకు 63వ ర్యాంకు

మిర్యాలగూడ టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాలోని మిర్యాలగూడ మునిసిపాలిటీ రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు సాధించింది. పరిశుభ్రత, పారిశుధ్య ప్రమాణాలను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ప్రతీ సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటిస్తుంది. వార్షిక సర్వేను అనుసరించి ప్రకటించిన ర్యాంకుల్లో పట్టణానికి జాతీయస్థాయిలో 417, రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు దక్కింది. ఇంటింటి చెత్త సేకరణలో 42శాతం, సెగ్రిగేషన్‌లో 35శాతం మార్కులతో ఈ ర్యాంకు సాధించినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రుల చీకటి ఒప్పందం బయటపెట్టాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రయోజనాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రాకు తాకట్టు పెట్టి బనకచర్లపై అబద్ధాలు మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. దేవరకొండ పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడుకి మధ్య అర్ధరాత్రి జరిగిన చీకటి ఒప్పందం ఏమిటో బయటపెట్టాలని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడి ప్రజలను ఎన్ని రోజులు మోసం చేస్తాడని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను అవగాహన లేకుండా మొదలుపెట్టి కార్మికుల ప్రాణాలను బలిగొన్నాడని విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల ఆంజనేయులు, టీవీఎన్‌రెడ్డి, వల్లపురెడ్డి, లోక్యానాయక్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

ధ్వంసమైన విగ్రహాల పరిశీలన




ఖిల్లాను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లాను పురావస్తు, పర్యాటక అధికారులు గురువారం సందర్శించారు. పురావస్తుశాఖ సహాయ డైరెక్టర్ నాగలక్ష్మి, పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ, ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి ఖిల్లాలో ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందని ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులు యూనుస్ పర్వాన్, వనం చంద్రమౌళి తెలిపారు. వారి వెంట ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులు, పర్యాటకశాఖ అధికారులు ఉన్నారు.

నేడు సాగర్‌కు డిప్యూటీ సీఎం భట్టి

• జలవిద్యుత్ కేంద్రంలో టర్బైన్ మరమ్మతుల పరిశీలన • విజయవిహార్‌లో జెన్‌కో అధికారులతో సమీక్ష



నాగార్జునసాగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమా ర్క పరిశీలించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లో ప్రజాభవన్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు సాగర్‌కు చేరుకుంటారు. అనంతరం అధికారులు, అనధికారులను కలుస్తారు. 11.35 గంటలకు హైలాన్‌కాలనీలోని ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.05గంటల వరకు అక్కడ టర్బైన్ మరమ్మతుల పనులను పరిశీలించి జలవిద్యుత్ ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం 12.05 నుంచి గంటల నుంచి మ ధ్యాహ్నం 1గంట వరకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రధాన జలవిద్యుత్ కేంద్రం గురించి, విద్యుత్ ఉత్పత్తి వివరాలను గురించి తెలుసుకుంటారు. 1.05 గంటలకు హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడ జెన్‌కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వకు వెంటనే నీరు విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు ఇంకిపోతున్నాయని, చెరువులు, బావుల్లో నీరు ఎండిపోతోందన్నారు. బోర్లు కూడా తగ్గిపోయాయని అన్నారు. వానాకాలం సీజన్‌కు సమాయత్తమైన రైతులు నారుమళ్లు పోశారని తెలిపారు. బోరు, బావుల్లో నీరు సక్రమంగా లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాల పరిరక్షణ, నారుమడుల సంరక్షణకు ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రంగారెడ్డి కోరారు. చెరువులు, కుంటలను కాల్వ నీటితో నింపి భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలని కోరారు. సాగర్ ప్రాజెక్టులో మొదటి పంటకు సరిపడా నీరు ఉన్నందున అధికారులు వానాకాలం పంటకు నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసాను పూర్తి స్థాయిలో విడుదల చేసి వానాకాలం పంటకు రైతులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి రాంమూర్తి, మూడావత్ రవినాయక్, అప్పారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మూసీ కాల్వలకు నేడు నీటి విడుదల



(ఆంధ్రజ్యోతి-భానుపురి,కేతేపల్లి)

మూసీ ఆయకట్టులో వానాకాలం సాగుకోసం నేడు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. నార్లుపోసి, దుక్కులు దున్ని ఒడ్డు, వరం పెట్టి నీటి కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు మురిసిపోనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల బోరుబావుల కింద వరినాట్లు వేశారు. వర్షాలు పడతాయని ఎదురుచూస్తున్న రైతాంగం ఆశలు ఆవిరయ్యే పరిస్థితి దాపురించిన తరుణంలో మూసీ ప్రాజెక్టు ఆదుకోనుంది. మూసీ ఆయకట్టు కింద ఉన్న మూడు నియోజకవర్గాల్లో సాగునీటి సమస్య తీరనుంది. ఈ వానాకాలం సీజన్‌లో 30వేల ఎకరాలకు నాలుగు విడతల్లో నీటి విడుదల చేయనున్నారు. మినుములు, పొద్దుతిరుగుడు, వేరుశనగకే వాడాలని నిబంధన ఉన్నా కొన్నేళ్లుగా అంతటా వరి సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టీఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్వద్ధామరెడ్డి



ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అశ్వద్ధామరెడ్డి

కనగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్వద్ధామరెడ్డి డిమాండ్ చేశారు. కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లా యాదగిరిగుట్ట, మిర్యాలగూడ, కోదాడ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, దేవరకొండ, నల్లగొండ డిపోలకు చెందిన కార్మికులతో తెలంగాణ మజ్దూర్ యూనియర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాన్ని ఆయన హాజరయ్యారు. సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. పని గంటలు, ఆలస్యపు డ్యూటీలు, సెలవుల తదితర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు కార్మికులు వివరించారు. అనంతరం అశ్వద్ధామరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. సంస్థను కాపాడేది కార్మికులేనని గుర్తించాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీఎంయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శంకర్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా నిలబడి డిమాండ్లను సాధించుకోవాలన్నారు. అనంతరం సంఘం నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర కార్యదర్శులు శ్రీదేవి, రాజలింగం, శ్రీనివాస్, సంఘం నాయకులు ఎంపీ రావు, సత్యనారాయణ, చంద్రకళ, సుజాత, మల్లేష్, నిరంజన్ పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి : ఎస్పీ

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు

నల్లగొండ క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లాలోని చింతపల్లి, దేవరకొండ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న కా నిస్టేబుళ్లు రాజారాంనాయక్, రవినాయక్‌లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వారికి పట్టీలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని అన్నారు. పోలీస్‌శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పనిచేయాలని సూచించారు.

స్పిల్‌వే శాశ్వత మరమ్మతులకు చర్యలు

● ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్



సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేను పరిశీలిస్తున్న ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ శ్రీనివాస్, అధికారులు

నాగార్జునసాగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేకు శాశ్వత మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఓఅండ్‌ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) ఈఎన్‌సీ శ్రీనివాస్ తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పరిశీలన భాగంగా గురువారం ఆయన సాగర్ ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, క్రస్ట్ గేట్లు స్పిల్‌వే, ఎడమ కాల్వ, ఎర్త్ డ్యామ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ శ్రీనివాస్ మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేకు శాశ్వత మరమ్మతుల కోసం ఇప్పటికే పలు కంపెనీలతో కలిసి పరిశీలించి చర్చించామని, ఏ ఒక్క కంపెనీ కూడా మరమ్మతులకు ముందుకు రాలేదన్నారు. ఇకపై ప్రతి ఏటా స్పిల్‌వేపై పడిన గుంతలను వెంటనే పూడ్చివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఏడాది మరమ్మతులు చేపట్టడానికి స్పిల్‌వే వద్ద అటు ఇటు కదిలే క్రేన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్యాలరీలను పరిశీలించి గ్యాలరీలోని ఫ్లోరస్ హోల్స్‌లో (ఊటనీరు బయటకు వచ్చే మార్గం) పేరుకుపోయిన కాల్షియంను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాజెక్టు నిర్వహణలో సమస్యలుంటే పరిష్కరిస్తాం

క్రస్ట్ గేట్లు ఎత్తడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్వహణలో ఏ చిన్న సమస్య ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం విజయవిహార్ అతిథి గృహంలో ప్రాజెక్టు ఇంజనీర్లతో కలిసి సమీక్ష ఏర్పాటుచేశారు. ఈ సమీక్షలో నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిడమనూరు మండలం తుంగపాడు వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎడమ కాల్వ ఆధునికీకరణ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ఇంచార్జీ ఎస్ఈ మల్లికార్జున్‌రావు, ఈఈలు వెంకటయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మోత్కూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ కేంద్రంలో ఇందిరానగర్ కాలనీకి చెందిన మున్నా(22) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్నా గతంలో ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోగా, ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో అతనిపై వేధింపుల కేసు నమోదు అయ్యిందని, ఆ కేసులో అతను జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై వచ్చాడని ఎస్ఐ తెలిపారు. అప్పటి నుంచి మనస్తాపంతో బాధపడుతూనే ఉన్నాడని, దీంతో గురువారం అద్దె ఇంట్లోని స్నానాల గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మున్నా తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడిగా నర్సింహ

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సింహ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసకావొద్దని తన పాటల ద్వారా చైతన్య పరుస్తున్నారు.


ఆకట్టుకున్న 'స్వేచ్ఛ, సంధ్యా వెలుగులు'





స్వేచ్ఛ నాటికలోని సన్నివేశాలు

నల్లగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. మూడవ రోజు కార్యక్రమాలను భారత ప్రభుత్వ సాంస్కృతిక విభాగం సభ్యుడు మారం రాజురామచంద్రరావు, సాహితీవేత్తలు డాక్టర్ పురుషోత్తమాచార్యులు, పెరుమాళ్ల ఆనందర్, ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎం. రెడ్డి దర్శకత్వంలో రూపొందించిన స్వేచ్ఛ నాటిక, మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో తడకమళ్ల రామచంద్రరావు దర్శకత్వంలో రూపొందించిన సంధ్యా వెలుగు నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోమలికళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, గౌరవాధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి ఎంఎల్. నర్సింహారావు, ఉపాధ్యక్షుడు జీఎల్. కుమార్, వి. భాస్కర్, హర్షిత్ పాల్గొన్నారు.



కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

నారి చేతిలో సిరిసంపద

● ధాన్యం సేకరణ ద్వారా మహిళా సంఘాలకు భారీగా కమీషన్ ● యాసంగిలో 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ● రూ.3.44 కోట్ల కమీషన్ పొందిన మహిళా సంఘాలు

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అతివలను భాగస్వాములను చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు తీసుకుంటోంది. యాదాద్రిభువనగిరి జిల్లా అధికారులు యాసంగి సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 30శాతం మహిళలకే అప్పగించారు. వారు విజయవంతంగా కేంద్రాలను నిర్వహించి అండగా నిలిచారు. యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయడం, మిల్లులకు తరలించడం లాంటి బాధ్యతలు సమర్థంగా నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి



ధాన్యంకొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు (ఫైల్)

ధాన్యం కొనుగోలులో మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయ సంఘాల సభ్యులు అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటా వేయించి సకాలంలో మిల్లులకు ధాన్యం చేరేలా చూశారు. రైతులకు రావాల్సిన ధాన్యం డబ్బులను సకాలంలో వారి ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం, అన్నదాతల మధ్య వారధిలా పనిచేసి ధాన్యం కొనుగోలు చేశారు.

కొనుగోలు చేసిన ధాన్యం ఇలా..

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 321 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 91కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిని స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. గ్రామ సమైక్య సంఘాల ద్వారా అవసరాల మేరకు ముగ్గురు నుంచి ఐదుగురు మహిళా సభ్యులు ఈ కేంద్రాలు నిర్వహించారు. బుక్ కీపర్, తేమ శాతం చూడడం, సీఏ, ఇద్దరు సభ్యులు కొనుగోలు కేంద్రం బాధ్యతలు చూసుకున్నారు. మహిళా సంఘాలకే కేటాయించిన ఐకేపీ సెంటర్ల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకుగాను క్వింటాకు రూ.32 చొప్పున ప్రభుత్వం కమీషన్ చెల్లించింది. మొత్తం రూ.3.44 కోట్లు మహిళా సంఘాల ఖాతాల్లో జమ కానున్నాయి. కమీషన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతర ఖర్చులు పోను 50శాతం డబ్బులు స్త్రీనిధి ఖాతాలో జమ చేస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మహిళా సహాయక సంఘాలకు 51 శాతం కేటాయించాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. వానాకాలం సీజన్‌లో 50 శాతం కేంద్రాలు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలోని శివారెడ్డిగూడెం, పెద్దగూడెం, జూలూరు, గోకారం, కక్కిరేణి, వెల్లంకి, శోభనాద్రిపురం గ్రామాల్లోని కేంద్రాల్లో పెద్దఎత్తున ధాన్యం సేకరించారు.

కొనుగోళ్లలో రాణించి..

ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక మహిళా సంఘాలు కీలకపాత్ర పోషిస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేశాయి. యాసంగి సీజన్‌లో తమకు కేటాయించిన ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాల ద్వారా 1,77,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ. 3.44 కోట్లు కమీషన్ రూపంలో ఆర్జించాయి. ఇందిరా మహిళా శక్తి పథకాల ద్వారా అతివల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం ధాన్యం సేకరణలోనూ వారికి అవకాశం కల్పించడంతో మహిళా సంఘాలు సత్తా చాటాయి.

రాష్ట్రంలోనే మొదటి స్థానం



ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుంది. వారికిచ్చిన లక్ష్యాన్ని 45రోజుల్లోనే పూర్తి చేశారు. ఒక్క యాసంగి సీజన్‌లోనే కమీషన్ రూ.3.44 కోట్లు ఆర్జించారు. ప్రస్తుతం జిల్లా స్త్రీనిధి బ్యాంకులో ఐకేపీ కేంద్రాల డిపాజిట్లు రూ.12కోట్లు ఉన్నాయి. ఇది రాష్ట్రంలోనే మొదటి స్థానం. ఈ వానాకాలం నుంచి మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం మహిళా సంఘాలకే కేటాయిస్తాం.

● నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి-భువనగిరి జిల్లా

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సైదులు బంధువులు, సైదులు (ఫైల్)

మర్రిగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని మేటిచందాపురం ఇందుర్తి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలంలోని దామర గ్రామానికి చెందిన బత్తుల చంద్రమ్మ, నరసయ్య దంపతుల పెద్ద కుమారుడు బత్తుల సైదులు(25) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బుధవారం మర్రిగూడ మండలంలోని మేటిచందాపురం ఇందుర్తి గ్రామానికి ఓ పని విషయంలో వెళ్లాడు. ఆ గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో క్రిమిసంహారక మందు తాగి అనుమానాస్పదస్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్థులు దగ్గరికి వెళ్లి చూసే సరికి సైదులు మృతిచెంది ఉన్నాడు. గ్రామస్థులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి అతని కోసం ఆరా తీశారు. సైదులు నాంపల్లి మండలంలోని దామర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయం తెలిసిన సైదులు తల్లిదండ్రులు రాత్రి ఏడు గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోలేదని, ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ గురువారం సైదులు తల్లిదండ్రులు, బంధువులు, దామర గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మృతికి కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

తవుడు లోడు లారీ దగ్ధం

వలిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తవుడు లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు టైరు పగిలి తవుడు పాటు లారీ గురువారం దగ్ధమైంది. మహారాష్ట్ర నుంచి తమిళ నాడుకు నుంచి తవుడు లోడుతో వెళ్తున్న లారీ యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పరిధిలోకి చేరగానే ప్రమాదవశాత్తు లారీ టైరు పగిలింది. నిప్పురవ్వలు ఎగిసి పడి మంటలు అంటుకొని లారీలోని తవుడుతో పాటు లారీ కూడా దగ్ధమైంది. ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.22.90లక్షలు

నార్కట్‌పల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మండలంలోని చెర్వుగట్టు ఆలయ హుండీ ఆదాయం 34 రోజులకు రూ.22.90లక్షలు సమకూరింది. గట్టుకింద అమ్మ వారి హుండీ ఆదాయం రూ.3,59,890లు, గట్టుపైన స్వామి వారి హుండీ ఆలయం రూ.19,30,740 మొత్తం రూ.22,90,630ల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం ద్వారా రూ.65,120 ఆదాయం వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో నల్లగొండ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్, దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎన్. నవీన్, శ్రీదుర్గా శివసాయి సేవా సమితి సభ్యులు హెచ్‌డీఎఫ్‌సీ నల్లగొండ బ్రాంచీ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ విశ్వ విద్యాలయం పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ సరళిని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, సీవోఈ ఉపేందర్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కాపీయింగ్ పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, ఇతర అధ్యాపక బృందం ఉన్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

మర్రిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు కడుపు నొప్పితో అస్వస్థతకు గురైన ఘటనలో వసతి గృహం ఫుడ్ ఇన్‌చార్జితో పాటు నర్సు, వార్డెన్(టేకర్) ముగ్గురికి జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం వసతి గృహాన్ని సందర్శించి సిబ్బంది విధి నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో వివరణతో పాటు సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలిగొండ/ రామన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలల్లోని వసతులను పరిశీలించారు. ఇంటర్మీడియట్ కీలకమని వారి భవిష్యత్తు మారుస్తుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకూడదని సూచించారు. ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వలిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతకుమార్, రామన్నపేట జీజేసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసన్నదేవి, అధ్యాపకులు డాక్టర్ పరుశరాములు, కృష్ణ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కళాశాలల్లో డ్రాపవుట్లు లేకుండా చూడాలని ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అధ్యాపకులు అడ్మిషన్లు పెంచడంపై దృష్టి సారించాలని, పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులను కలవాలని ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ కళాశాలలకు ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని, ఆయా నిధులతో కళాశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యత, సాంకేతికతతో కూడిన బోధన చేయాలని సూచించారు. క్రీడా పరికరాలు, ప్రాక్టికల్ సామాగ్రి సమకూర్చాలని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో దస్రునాయక్. పాఠశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపకులు కృష్ణకుమారి, జ్యోత్స్న, వరలక్ష్మీ, సంధ్య, సల్మా, మధు, అరిస్టాటిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లు, పురుగుల మందు డబ్బాలతో బాధితుల ఆందోళన



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మిర్యాలగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మొల్కచర్ల గ్రామానికి చెందిన దైద రమణ, దైద శ్రీను కుటుంబసభ్యులు ఉదయం 11 గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు కదిలేదిలేదని భీష్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామం సర్వే నెంబర్ లో తమ పేర పట్టాకలిగిన 153బై 151, 163, 163బై2 లోని మూడు ఎకరాల ఇనాం భూముల ను మాజీ సీఎం వైఎస్ హయాం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. తమ భూమిలోకి అదే గ్రామానికి చెందిన పాతులోతు సుజాత, రాంకోటి రాత్రి సమయాల్లో యంత్రాలు, మందిమార్బలంతో వచ్చి చెట్లు నరికి, భూమి దున్ని కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో అడవి దేవులపల్లి తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆ భూమికి ఆనుకుని ఉన్న మా పేర పట్టాకలిగిన ఇనాం భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి తమ భూములకు, తమకు రక్షణ కల్పించాలని లేకుంటే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని భీష్మించారు. పూర్తిస్థాయి లో విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తానని సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు

● రైల్వే గేటు కష్టాలు తప్పినా.. యూటర్న్ టెన్షన్
● ఎవరు ఎటు వెళుతున్నారో తెలియక తికమక
● కనిపించని వేగ నియంత్రణ సూచికలు



హైవే అండర్‌పాస్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న బస్సు, ఇతర వాహనాలు

బీబీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంతో గేటు కష్టాలు తప్పాయనుకుంటే.. హైవే అండర్ పాసింగ్ వద్ద ఫ్లైఓవర్ ముగింపు వద్ద యూటర్న్ పాయింట్ వాహనాదారులను టెన్షన్ పెడుతోంది. వాహనాలు మలుపు తిరిగే క్రమంలో ఎవరు ఎటువైపు వెళ్తున్నారో తెలియక ముచ్చెమటలు పడుతున్నాయి. బ్రిడ్జిపై వేగ నియంత్రణ చర్యలు తీసుకోని కారణంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు

బీబీనగర్ మండలకేంద్రం మీదుగా హైదరాబాద్, భువనగిరి వైపు నిత్యం రాకపోకలు కొనసాగించే సుమారు 50గ్రామాల ప్రజలకు రైల్వే గేటు తిప్పలు తప్పించేందుకు అప్పటి ప్రభుత్వం రైల్వే మార్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించింది. మండలంలోని రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ముందు నుంచి బ్రిడ్జి మొదలై హైదరాబాద్ వైపున హైవే అండర్ పాసింగ్‌లను కలుపుతూ 600మీటర్ల పొడవున ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి ముంగిపు వద్ద బీబీనగర్ పాత గ్రామంలోని, బైపాస్ రోడ్డుకు, హైదరాబాద్ వైపుకు వెళ్లే వారి కోసం యూ టర్న్ పాయింట్ పెట్టారు. ఈ ప్రదేశం ఇరుకుగా ఉంటుంది. ఒక వైపు రైల్వే ట్రాక్ మరో వైపు హైవే బ్రిడ్జి సపోర్ట్ వాల్ నిర్మించి ఉన్నాయి. దీంతో పాత బీబీనగర్ గ్రామం వైపు నుంచి పట్టణంలోకి.. పట్టణం నుంచి పాత గ్రామంలోకి నిత్యం రాకపోకలు కొనసాగించే ఆర్టీసీ బస్సు లతో పాటు ఇతర ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సులు యూటర్న్ చేసుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులు, ఇతర పెద్ద వాహనాలు, ఇక్కడ మలుపు తీసుకుంటున్న సమయాల్లో రెండు వైపులా వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఓ వైపు ఎయిమ్స్ ఆసుపత్రి, ఇటు వైపు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు ఉండడంతో వాహనాల రద్దీ పెరిగింది. బ్రిడ్జిపై నుంచి పట్టణంలోకి ప్రవేశంతో పోచంపల్లి చౌరస్తా వాహనాల సందడి ఉంటుంది. నాలుగు వైపులా నుంచి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ వాహనాల క్రమబద్దీకరణ వేగ నియంత్రణకు ఎలాంటి చర్యలు సూచికలు లేని కారణంగా వాహనాదారులు తికమక పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



రైల్వే బ్రిడ్జిపై వేగ నియంత్రణ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పోచంపల్లి చౌరస్తాలో, హైవే, హైదరాబాద్ వైపు, హైవే అండర్ పాసింగ్ దగ్గర యూటర్న్ వద్ద వాహనదారులను నియంత్రించే వ్యవస్థ లేక ఎవరు ఎటు వైపు వెళ్తారో గమనించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

దేవరుప్పల పృథ్వీకుమార్, బీబీనగర్.

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.


ప్రేమ్‌రావత్
9246275220

ఆలయ దర్శనం



యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్భయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎన్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్‌ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.


డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తాకోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్తులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,

అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.



వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కొషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క అతను వెళ్ళి పోతూ ఉంటే... రోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్ణిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... అయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

'ఎమ్మెల్యే వీరేశంను విమర్శించడం సరికాదు'

కేతేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లో వార్డు సభ్యునిగా గెలవలేని వారు ఎమ్మెల్యే వీరేశంను విమర్శించడం సరైందికాదని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు అల్లి అంజన్‌కుమార్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మున్నా అశోక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు వెంబడి అఖిల్, ఎన్.ప్రణయ్, షైనం శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



తిప్పర్తి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా ఎస్.సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై తిప్పర్తికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి సంగారెడ్డికి జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ, పథకాలు, అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.

సమాచారం

సీపీఐ జిల్లా కమిటీలో ముగ్గురికి చోటు

చిట్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం నుంచి సీపీఐ జిల్లా కార్యవర్గంలో ముగ్గురికి చోటు లభించింది. మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, గీతపనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ్రాంపల్లికి చెందిన బొడిగె సైదులు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా గుండ్రాంపల్లికి చెందిన జిల్లా యాదయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులయ్యారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుమలత

కనగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండల ఎంపీడీవోగా (ఎఫ్ఏసీ) కె. సుమలత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ అండాలు, జూనియర్ అసిస్టెంట్ గోవర్ధన్ బాయి, ఏపీవో సుధాకర్, కార్యదర్శులు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- ఈ నెల 23న విద్యాసంస్థల బంద్
- వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

నల్లగొండరూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, పీవైఎల్, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో సమావేశంల నిర్వహించారు. అనంతరం ఆయా విద్యార్థి సంఘాల నాయకులు ఇందూరు సాగర్, ఖమ్మంపాటి శంకర్, ముదిగొండ మురళీకృష్ణ, పోలే పవన్, మల్లం మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి పెనం లోంచి పొయ్యిలో పడ్డ చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అనేక త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమి, మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల విచ్చలవిడిగా ఫీజుల దోపిడీతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో అందించాలని, బట్టలు, చెప్పులు, ప్లేట్లు, గ్లాసులు, నోట్ బుక్స్ వెంటనే అందించాలని, శిథిలావస్థకు చేరిన బిల్డింగులను తొలగించి నూతన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అధ్యాపక, ఉపాధ్యాయ, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కోరారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలని, అనుమతి లేని ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నిమల్ల ఆంజనేయులు, సూర్య తేజ, పీడీఎస్‌యూ నాయకులు ఎండీ సోయల్, లోకేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, ప్రభాస్, మధు, నవ్య, ఏఐఎఫ్‌డీఎస్ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానం, నైపుణ్యం నేర్చుకోవాలి

నల్లగొండటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్య, విజ్ఞానం, నైపుణ్యాలను నేర్చుకోవడానికి చేరి సమాజ సేవ చేయడానికి తరలివెళ్లాలని ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. పట్టణంలోని ఎన్‌జీ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం జీవశాస్త్ర విభాగాల విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో 70వేల పుస్తకాలతో గ్రంథాలయం, అధునాతన సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలలు, విశాలమైన క్రీడా మైదానం, అపారమైన అనుభవం గల అధ్యాపకులు వంటి ఎన్నో సౌకర్యాలు ఉన్నాయన్నారు. వీటిని సమర్థవంతంగా ఉపయోగించుకొని అన్ని నైపుణ్యాలతో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఉద్యోగ అవకాశాల కోసం క్యాంపస్‌లో తరచుగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను కూడా నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన విహారయాత్రలు క్రమం తప్పకుండా జరుగుతాయన్నారు. స్వయం ఉపాధి కోర్సుల్లో చేరి మరింత విజ్ఞానాన్ని సముపార్జించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవికుమార్ మాట్లాడుతూ కళాశాలలో చదివి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థల్లో, విశ్వ విద్యాలయాలల్లో పనిచేస్తున్న విద్యార్థుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి బత్తిని నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ జోత్స్న, వెల్లంగి శ్రీధర్, వైవీఆర్ ప్రసన్నకుమార్, ఏ.మల్లేశం, శివరాణి, సుధాకర్, శిరీష, అంజయ్య, చంద్రయ్య, కందుకూరి దుర్గప్రసాద్, మహేశ్వరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరుచేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు హాశం

నల్లగొండ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన పార్టీ పట్టణ బాధ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని పేదలు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు కావస్తున్నా నేటికీ అర్హులైన పేదలకు పింఛన్లు లేకపోవడంతో బతుకు బండి నడపలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న మాదిరిగా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సర్వేలు నిర్వహించి అర్హులైన పేదలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యుడు కుంభం కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



గ్రామదేవతలకు పూజలు చేస్తున్న చిన్నతుమ్మలగూడెం గ్రామస్థులు

నార్కట్‌పల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతుమ్మలగూడెం గ్రామంలో వర్షాలు కురవాలని మహిళలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. కప్పకాముడు ఆడి వరదపాశం పోశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి రాజు యాదవ్‌తో పాటు అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వారిజాల వేణుగోపాల స్వామి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు కారంపూడి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణతంతు వైభవంగా జరిగింది. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేష్, సామ కొండల్‌రెడ్డి, బండారు రమేష్, కొప్పు నర్సింహ, దోసపాటి విష్ణు, వేణు, అమరవాది రాములు, దూదిమెట్ల స్రవంతి, రాధారపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ టీడీపీతోనే సాధ్యం



శాలిగౌరారంలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆకారపు రమేష్

శాలిగౌరారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో టీడీపీని ఆదరిస్తే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఆకారపు రమేష్ అన్నారు. మండలకేంద్రంలో గురువా రం టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నక్క రాంబానేష్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, నాయకులు కూరం లింగయ్య, పులుసు శేఖర్, దామరోజు సత్యనారాయణ, దేవర మల్లయ్య, కుక్కల యాదగిరి, గాలీఫ్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

శాలిగౌరారం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం రాష్ట్ర నాయకుడు ఎర్ర బుచ్చయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం ఎంపీడీవో జ్యోతిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అందించడంతో పాటు పేదలకు ఉపాధి పని కల్పిస్తున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నెలా మొదటి తేదీన వేతనాలు అందించి ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం మండల నాయకులు బట్ట సైదులు, సైదులు, ఉపేందర్, యానాల లింగమ్మ, నీరజ, విజయ, అండాలు, సుజాత, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించే హక్కు ప్రసన్నరాజుకు లేదు'

కట్టంగూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని బీఆర్ఎస్ నాయకుడు నలగాటి ప్రసన్నరాజు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కత్తుల వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యేను విమర్శించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ బండారు కృష్ణ, నాయకులు అంజయ్య, గద్దపాటి యాదయ్య, విజయ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు రాములుకు నివాళి

చండూరు రూరల్, జులై 17(ఆంధ్రజ్యోతి): మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కాశమల్ల రాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కోమటి వీరేశం రాములు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. బీజేపీ మండల శ్రేణుల సహకారంతో సేకరించిన రూ.40వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ముదిగొండ అంజనేయులు, సీనియర్ నాయకులు బొబ్బల మురళీమనోహర్‌రెడ్డి, చిలుకూరి అశోక్, రావిరాల శ్రీను, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం నల్లగొండకు తలమానికం

కనగల్, జూలై 17, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని లతీఫ్‌సాహెబ్ గుట్టకు ఘాట్ రోడ్డు నిర్మించడం పట్టణానికి తలమానికమని జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ జియావుద్దీన్ అన్నారు. కనగల్ మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో ఇన్నాళ్లకు ఘాట్ రోడ్డు కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ప్రతిఏటా జరిగే లతీఫ్‌సాహెబ్ గుట్ట ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక అన్నారు. రోడ్డు నిర్మాణం జరిగాక లతీఫ్‌సాహెబ్ గుట్ట పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందటం ఖాయమన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కట్టంగూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీహెచ్ నర్సింగ్‌రావు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల విద్యాధికారి అంబటి అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం జి.వరలక్ష్మి, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, పద్మావతి, సునీత, శైలజ, జానకి, ఉపాధ్యాయులు కొంక ఆంథోని, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

మర్రిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమను వేధింపులకు గురిచేస్తున్న ఆదర్శ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది గురువారం డీఈవో భిక్షపతికి ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ శివ స్వరూపరాణి తోటి ఉపాధ్యాయులు ఏ ఒక్కరూ కూడా మాట్లాడవద్దని వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ అవమాన పరిస్తుందని వారు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఈవో భిక్షపతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

శాలిగౌరారంలో వర్షం

శాలిగౌరారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 20 రోజులుగా ఎండల వేడిమితో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వర్షాలు పడాలని పూజలు, పండగలు చేశారు. శాలిగౌరారంలో గురువారం తెల్లవారుజామున వాతావరణం ఒక్కసారిగా చల్లబడి భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం కూడా భారీ వర్షం కురవడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిట్యాలలో యువతి అదృశ్యం

చిట్యాలరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలం ఏపూర్ గ్రామానికి చెందిన యువతి కనిపించడం లేదని చిట్యాల ఎస్ఐ రవికుమార్ తెలిపిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యప్రదేశ్ చెందిన కైలాస్ బన్సాల్ ఏపూర్ శివారులో గల డీఈసీ కంపెనీలో నెలరోజుల క్రితం పనికి చేరాడు. అతను భార్య, పిల్లలతో కలిసి కంపెనీకి సంబంధించిన క్వార్టర్స్‌లోనే ఉంటున్నాడు. కుమార్తె నీలు బన్సాల్ కూడా అదే కంపెనీలో పనిచేస్తుంది. ఈనెల 13వ తేదీన సెలవు కావడంతో తల్లిదండ్రులు విశ్రాంతి కోసం నిద్రించగా నీలు బన్సాల్ బయటకు వెళ్లింది. చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో వెతికినా కూడా ఆచూకీ లభించలేదు. తండ్రి కైలాస్ బన్సాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చేనేత భరోసా అందరికీ ఇవ్వాలి : కర్నాటి



నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు

గట్టుప్పల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జియో ట్యాగ్ ఉన్న చేనేత కార్మికులందరికీ చేనేత భరోసా కల్పించాలని చేనేత రుణమాఫీలో నిబంధనలు సడలించాలని చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు కర్నాటి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం చేనేత కార్మికులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల మగ్గాలకు జియో ట్యాగ్ కలిగిన చేనేత కార్మికుడికి రూ.18వేలు అనుబంధ కార్మికుడికి రూ.6వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణం తీసుకున్న ప్రతి చేనేత కార్మికుడికి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నేత కార్మికులకు జియో ట్యాగ్ నెంబర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు చెరుపల్లి సత్తయ్య, ఇడెం బుచ్చయ్య, రాపోలు సత్తయ్య, గడ్డం నర్సింహ, కుకడాల అశోక్, చేరుపల్లి చంద్రమౌళి, జెల్ల మరయ్య, చేరుపల్లి కృష్ణయ్య, దోర్నాల నర్సింహ, శంకరయ్య, గంజి పెద్దులు, కర్నాటి యాదయ్య, సామల అంజయ్య, పెదగాని నర్సింహ, జెల్ల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికలపైనే నజర్

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నిర్ణయిస్తే, స్థానాల కేటాయింపును కలెక్టర్ నేతృత్వంలో ఖరారు చేస్తారు. ఎంపీటీసీ స్థానాలకు కోటాను కలెక్టర్ల నేతృత్వంలో ఖరారు చేస్తే, స్థానాల కేటాయింపును ఆర్డీవోల నేతృత్వంలో ఖరారు చేయాల్సి ఉంటుంది. 2011 ఆధారంగా జిల్లాలో ఆయా మండలాల్లో ఏ రిజర్వేషన్ వస్తుందనే అంశంపై ఇప్పటికే రాజకీయనాయకులు తమ తమ అంచనాలతో లెక్కలు వేసుకుంటున్నారు. జడ్పీచైర్మన్ పదవి ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే అంశంపైనా ఆ పదవిని ఆశించే వివిధ సామాజికవర్గాలకు చెందిన కీలకనాయకులు చర్చలు జరుపుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ పదవులు ఆశించే మండలస్థాయి నాయకులు తమకు రిజర్వేషన్ల అదృష్టం ఏమేరకు సహకరిస్తుందోననే ఎదురుచూపులో ఉన్నారు. రిజర్వేషన్లు తేలితే బరిలో దిగేందుకు నాయకులు రంగం సిద్ధం చేసుకొని ఉండడంతో అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ కొనసాగుతోంది. ఈనెలాఖరులోగా రిజర్వేషన్లు ఖరారవుతాయనే అంచనా ఇటు రాజకీయ వర్గాల్లో, అటు అధికారవర్గాల్లో నెలకొంది.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే వేముల వీరేశం



కట్టంగూరు: చెర్వుఅన్నారంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, నకిరేకల్, చిట్యాలరూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరు, నకిరేకల్, చిట్యాల మండలాలలోని పలు గ్రామాల్లో గురువారం గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల లో పేదవారికి ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్లు దశలవారీగా మంజూరు చేస్తామన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 3500 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇళ్లు మం జూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పింఛన్లకు అర్హులైన వారికి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ధర్మారెడ్డిపల్లి కాల్వ పనులను పూర్తిచేయించి సాగునీటిని అందిస్తానని, రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో కట్టంగూరులో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు నంద్యాల వెంకట్‌రెడ్డి, పెద్దరాములు, జానయ్య, మిట్టపల్లి శివశంకర్, రాజు, అయితగోని నర్సింహ, అంజన్‌కుమార్, నకిరేకల్‌లో కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాదగో ని కొండయ్య, యేసుపాదం, నరేందర్, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతునాయకులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమపౌరులుగా ఎదగాలి



చిత్తలూరు జడ్పీ స్కూల్‌కు బెంచీలు, డెస్కులు అందజేస్తున్న దాతలు

చిట్యాల, శాలిగౌరారం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి దేశం గర్వించేలా ఉత్తమ పౌరులుగా ఎదగాలని గాజా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చీఫ్ మేనేజర్ జనార్ధన్ కోరారు. గురువారం జిల్లాలోని చిట్యాల, శాలిగౌరారం మండలాలలోని పలు పాఠశాలలకు డెస్కులు, బెంచీలు, విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిల్, గ్రాఫ్‌నోట్ బుక్స్, జామెట్రీ బాక్కులు, వాటర్ బాటిల్స్ మొదలైన స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో తమ సంస్థ సాధించిన లాభాల్లో కొంత ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులకు అం దించాల్సిన ఆలోచన కలిగిందన్నారు.

విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. దాతల సహకారంతో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత తీసుకొని విద్యాభివృద్ధికి, విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. తమ పాఠశాలలను ఎంచుకొని దాతృత్వాన్ని పంచుకున్న గాజా యాజమాన్యానికి గ్రామస్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

- చిట్యాలలోని ప్రాథమిక పాఠశాలకు 25 డ్యూయల్ డెస్క్ బెంచీలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ బ్యాగులు, జామెట్రీ బాక్కులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.
- శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు జడ్పీ హైస్కూల్‌కు 80వేల విలువైన 15 డెస్కులు, 15 బెంచీలను అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 43మంది విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో గాజా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్లు జి.అప్పలకొండ, ఎన్.సాంబమూర్తి, హెచ్ఎంలు అంబటి సత్తయ్య, పద్మజ, ఆర్. జ్యోతి, శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ సోమలక్ష్మి రాములు, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, ఉపాధ్యాయులు కోణం శ్రీనివాస్, ప్రియాంక, సత్తిరెడ్డి, చంద్రశేఖర్, వనజాత, ఖాదర్‌పాషా, పూజ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి

(5వ పేజీ తరువాయి)

పడుతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఆకులు, మండలు 10శాతం తరుగు పోగా, రవాణా ఖర్చులు కలుపుకుంటే వందకు విక్రయించాల్సి వస్తోందంటున్నారు. నేతాజీ కాయగూర మార్కెట్, రైతు బజార్లలో పచ్చి మిర్చి ధర రూ.100 ఉండగా, కూడళ్లలోని చిరు వ్యాపారులు కిలో రూ. 120(పావు కిలో రూ. 30) చొప్పున విక్రయిస్తున్నారు.


ధరలు తగ్గించాలి



పావు కిలో పచ్చి మిర్చి రూ.30కి విక్రయిస్తున్నారు. మిర్చీతోపాటు ఇతర కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. దొండ, బెండ ధర రూ.50 దాటగా, బీర, చిక్కుడు కాయలు కిలో ధర రూ.80గా ఉంది. మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం అందించిన ప్రభుత్వాలు కూరగాయలు ధరలు అమాంతం పెరగ్గా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. ధరలు నియంత్రించాలి.

– ఆర్.దేవమణి, గృహిణి, మిర్యాలగూడ

హోల్‌సేల్‌గానే కిలో రూ. 75



పచ్చి మిర్చి ధర హోల్‌సేల్‌గానే కిలో రూ.75 చెల్లించాల్సి వస్తోంది. తరుగు, ట్రాన్స్‌పోర్ట్‌తో కలిపి రూ. 85 అవుతోంది. ప్రజలకు ఇబ్బంది కలగకూడదని రూ.90కే అమ్ముతున్నాం. వర్షాలు కురవక కూరగాయల పంట సాగు తగ్గింది. దీంతో అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. మిర్చి సహా అన్ని కాయగూరలు దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అక్కడక్కడ వర్షాలు కురుస్తుండగా, ఆగస్టులో ధరలు తగ్గే అవకాశముంది.

– సుంకు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, నేతాజీ కూరగాయల మార్కెట్, మిర్యాలగూడ

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	560.70 (234.0796)	65,522	1,800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.34 (3.53)	-	139.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.017 (18.2313)	-	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి

● రోజురోజుకూ పెరుగుతున్న ధర

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)



అల్పాహారమైనా, ఆహారమైనా అన్నింట్లో తప్పనిసరి కావాల్సింది పచ్చిమిర్చి. విటమిన్లు, ఖనిజాలు, యాంటి ఆక్సిడెంట్లతో కూడి ఆహారానికి కారపు రుచిని జోడించే పచ్చి మిరపకాయలు సామాన్యుల కంట తడి పెట్టిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడంతో పచ్చిమిర్చి ధర మండిపోతోంది. సాధారణ రకమైన పచ్చి మిర్చి కిలో రూ.100 ఉండగా ప్రత్యేక మిర్చీ ధర రూ.120కి చేరింది.

సరఫరా తగ్గడంతోనే..

పచ్చి మిర్చి ధర రూ.10కి పావుకిలో అంటేనే ఎక్కువ అనిపిస్తుంది. పక్షం రోజుల క్రితం కిలో ధర రూ.50 నుంచి రూ.60 ఉండగా, ప్రస్తుతం సెంచరీ కొట్టింది. అలాంటిది పావుకిలో పాతిక రూపాయలు దాటగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనేందుకు వెనుకాడుతున్నారు. అయితే దిగుబడి తగ్గిన కారణంగానే ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. స్థానికంగా మిర్చి పంట లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతోనే ధరలు పెరిగాయంటున్నారు. రాయలసీమలోని కర్నూలు, సమీప ప్రాంతాలనుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని, కిలో ధర హోల్‌సేల్‌గానే రూ.70 నుంచి రూ.77 వరకూ - మిగతా 8వ పేజీలో...



● ఏర్పాట్లలో పంచాయతీరాజ్ శాఖ ● రిజర్వేషన్లకోసం రాజకీయ నాయకుల ఎదురుచూపు ● ఇప్పటికే ప్రాథమిక ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మొదటగా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు మొదలైంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసిన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఇప్పటికే ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్లు సైతం ఖరారు చేయడంతోపాటు పోలింగ్ సిబ్బందిని సైతం గుర్తించి శిక్షణ ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

పార్టీలపరంగానే ఈ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో అందుకు అవసరమైన పోలింగ్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలను సైతం అందుబాటులో ఉంచుకున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారుచేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన మరుక్షణం ఎన్నికల నిర్వహణలోకి దిగేందుకు వీలుగా పంచాయతీరాజ్‌శాఖ సన్నద్ధమయింది. మరోవైపు అధికార కాంగ్రెస్‌తోపాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు సైతం రిజర్వేషన్లపై ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 33 జడ్పీటీసీ, 33 ఎంపీపీ, 353 ఎంపీటీసీ స్థానాలు

రాష్ట్రంలోనే పెద్ద జిల్లా అయిన నల్లగొండలో 33 మండల పరిషత్‌లతోపాటు, 33 జడ్పీటీసీ స్థానాలు, 353 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా 2016లో నూతనంగా అడవిదేవులపల్లి, కొండమల్లేపల్లి, మాడుగులపల్లి, నేరేడుగొమ్ము, తిరుమలగిరి (సాగర్) మండల పరిషత్‌లు ఏర్పాటయ్యాయి., 2019 పరిషత్ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా వీటిని కలుపుకొని 31 జడ్పీటీసీ స్థానాలు, 31 మండల పరిషత్‌లతోపాటు, 352 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజాగా గట్టుప్పల్, గుడిపల్లి మండలాలు ఏర్పాటు కాగా, తాజాగా ఈమండలాలను కలుపుకొని 33 జడ్పీటీసీ స్థానాలు, 33 మండల పరిషత్‌లలో 353 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. అత్యధికంగా మిర్యాలగూడ మండల పరిషత్‌లో 19 ఎంపీటీసీ స్థానాలుండగా, అత్యల్పంగా అడవిదేవులపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి మండలాల్లో అయిదేసి చొప్పున ఎంపీటీసీ స్థానాలున్నాయి.

రిజర్వేషన్ల కోసం నాయకుల నిరీక్షణ

పరిషత్ ఎన్నికలకు అధికారయంత్రాంగం సన్నద్ధమవుతుండగా, రాజకీయనాయకులు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఈ ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే ప్రయత్నాలు చేపట్టడంతో ఆర్డినెన్స్ వచ్చిన తక్షణమే రిజర్వేషన్ల కోటా, స్థానాలు ఖరారు చేసేందుకు పంచాయతీరాజ్‌శాఖ సిద్ధమయింది. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు చేయనుండగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. అదేవిధంగా మండలం యూనిట్‌గా ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయిస్తారు. జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్ల కోటాను - మిగతా 8వ పేజీలో...

జడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
1.అడవిదేవులపల్లి	05	7,395	7,376	0	14,771
2.అనుముల	08	10,779	11,414	1	22,194
3.చందంపేట	09	16,008	15,083	1	31,092
4.చండూరు	08	12,118	12,201	0	24,319
5.చింతపల్లి	14	22,570	22,732	2	45,304
6.చిట్యాల	12	17,905	18,074	0	35,979
7.దామరచర్ల	14	20,212	20,767	3	40,982
8.దేవరకొండ	11	17,937	17,797	1	35,735
9.గట్టుప్పల్	05	7,883	7,825	0	15,708
10.గుడిపల్లి	05	6,175	6,278	0	12,453
11.గుండ్లపల్లి	13	21,407	21,531	2	42,940
12.గుర్రంపోడు	12	19,137	19,785	2	38,924
13.కనగల్	12	18,202	18,484	0	36,686
14.కట్టంగూరు	13	18,696	18,943	0	37,639
15. కేతేపల్లి	11	15,218	16,042	1	31,261
16. కొండమల్లేపల్లి	09	15,129	14,706	3	29,838
17.మాడుగులపల్లి	10	14,867	15,751	0	30,618
18.మర్రిగూడ	10	15,215	15,632	0	30,847
19.మిర్యాలగూడ	19	27,488	28,467	7	55,962
20.మునుగోడు	13	18,959	19,030	0	37,989
21.నకిరేకల్	9	13,280	13,576	2	26,858
22.నల్లగొండ	13	19,183	20,067	0	39,250
23.నాంపల్లి	11	17,846	18,453	1	36,300
24.నార్కట్‌పల్లి	15	21,621	22,359	1	43,981
25.నేరేడుగొమ్ము	6	10,173	9,769	3	19,945
26.నిడమనూరు	13	17,635	18,682	1	36,318
27.పీఏపల్లి	10	13,940	13,845	6	27,791
28.పెద్దవూర	11	16,889	17,507	8	34,404
29.శాలిగౌరారం	13	20,200	20,652	3	40,855
30.తిప్పర్తి	9	13,529	14,227	0	27,756
31.తిరుమలగిరిసాగర్	11	17,603	17,848	3	35,454
32.త్రిపురారం	12	18,087	18,857	4	36,948
33.వేములపల్లి	07	10,047	10,669	0	20,716
మొత్తం	353	5,33,333	5,44,429	55	10,77,817

ఎండుతున్న పంటలకు జీవం

● ఉమ్మడి నల్లగొండలో అత్యధికంగా 6.4సెంటీమీటర్ల వర్షం



నల్లగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం కురిసిన వర్షం ఎండలకు వాడిపోతున్న పత్తి, కంది పంటలకు ఈ వర్షం జీవం పోసినట్టయ్యింది. వర్షాలు లేక ఎరువులు వేయక పోవడంతో మెట్ట పంటల ఎదుగుదల ఆగిపోయి వాడిపోతున్నాయి. ఈ దశలో వర్షం కురియడంతో రైతులు ఆనందపడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగామలో అత్యధికంగా 6.4సెంటీమీటర్లు, సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఆరు సెంటీమీటర్లు, నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరులో 4.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

హాస్టళ్లలో ముఖ ఆధారిత హాజరు

● ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే కఠిన చర్యలు ● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో ఫేస్ రికగ్నైషన్ హాజరును అమలు చేస్తామని, వార్డెన్లు ఫేస్ రికగ్నైషన్ యాప్‌లో హాజరుకాకుంటే వారి జీతాన్ని నిలిపివేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జి ల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ఉదయాదిత్య భవన్‌లో అన్ని సంక్షేమ శాఖల అధికారులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే సంబంధిత ఉ ద్యోగులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని అన్ని హాస్టళ్లను సందర్శించి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని హాస్టళ్లలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎంలు తప్పనిసరిగా జాబ్ చార్ట్ నిర్వహించాలని, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైతే సంబంధిత హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్, సంబంధిత రీజనల్ కో-ఆర్డినేటర్లపై కఠినచర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి, అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, రమణారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పు ట్ల శ్రీనివాస్, ఆయా సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, డీఈవో భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలుచేయాలి

అడవిదేవులపల్లి, దామరచర్ల: పేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరగకుండా పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాల్లో గురువారం ఆమె పర్యటించారు. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాలకు సమయానుకూలంగా రావాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల ప రిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అడవిదేవుపల్లి మండల కేం ద్రానికి చేరువలో ఉన్న టెయిల్ పాండ్‌ను పరిశీలించి నీటి నిల్వ గురించి అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్, మండల ప్రత్యేకాధికారి, గృహనిర్మాణ శాఖల అ ధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ప్రభుత్వం నిబంధనల మేరకు కొలతల ప్రకారం నిర్మించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమాల్లో ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీసీవో పత్యానాయక్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్లు రాగ్యా నాయక్, జవహర్‌లాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

హైవేపై అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటు



కేతేపల్లిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలు

కేతేపల్లి, జూలై 17(ఆంధ్ర జ్యోతి): కేతేపల్లి మండల కేంద్రంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికార్డెడ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే వాహనాలను గుర్తించడంలో ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమించడానికి జిల్లాలోని పెద్దవూర, మాడ్గులపల్లి, కేతేపల్లి మండల కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఆధునిక సాంకేతికత కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచనల మేరకు ప్రమాదాల కేంద్రంగా మారిన కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ వద్ద గల జంక్షన్‌లో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కెమెరాకు రూ.50వేల కంటే ఎక్కువే ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కెమెరాలు జాతీయ రహదారులపై చిమ్మచీకట్లో సైతం 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లే వాహనాలను నెంబర్‌తో సహా గుర్తించగలుగుతాయని కేతేపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు. హైదరాబాద్-విజయవాడల మధ్య గల ఈహైవేకు ఇరువైపులా ఒక్కో కెమెరాను అమర్చి వాటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మిర్యాలగూడకు 63వ ర్యాంకు

మిర్యాలగూడ టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాలోని మిర్యాలగూడ మునిసిపాలిటీ రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు సాధించింది. పరిశుభ్రత, పారిశుధ్య ప్రమాణాలను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ప్రతీ సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటిస్తుంది. వార్షిక సర్వేను అనుసరించి ప్రకటించిన ర్యాంకుల్లో పట్టణానికి జాతీయస్థాయిలో 417, రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు దక్కింది. ఇంటింటి చెత్త సేకరణలో 42శాతం, సాగ్రిగేషన్‌లో 35శాతం మార్కులతో ఈ ర్యాంకు సాధించినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రుల చీకటి ఒప్పందం బయటపెట్టాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రయోజనాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రాకు తాకట్టు పెట్టి బనకచర్లపై అబద్ధాలు మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. దేవరకొండ పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడుకి మధ్య అర్ధరాత్రి జరిగిన చీకటి ఒప్పందం ఏమిటో బయటపెట్టాలని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడి ప్రజలను ఎన్ని రోజులు మోసం చేస్తాడని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను అవగాహన లేకుండా మొదలుపెట్టి కార్మికుల ప్రాణాలను బలిగొన్నాడని విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల ఆంజనేయులు, టీవీఎన్‌రెడ్డి, వల్లపురెడ్డి, లోక్యానాయక్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

ధ్వంసమైన విగ్రహాల పరిశీలన



ఖిల్లాను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లాను పురావస్తు, పర్యాటక అధికారులు గురువారం సందర్శించారు. పురావస్తుశాఖ సహాయ డైరెక్టర్ నాగలక్ష్మి, పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ, ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి ఖిల్లాలో ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందని ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులు యూనుస్ పర్వాన్, వనం చంద్రమౌళి తెలిపారు. వారి వెంట ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులు, పర్యాటకశాఖ అధికారులు ఉన్నారు.

నేడు సాగర్‌కు డిప్యూటీ సీఎం భట్టి


● జలవిద్యుత్ కేంద్రంలో టర్బైన్ మరమ్మతుల పరిశీలన ● విజయవిహార్‌లో జెన్‌కో అధికారులతో సమీక్ష



నాగార్జునసాగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమా ర్క పరిశీలించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లో ప్రజాభవన్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు సాగర్‌కు చేరుకుంటారు. అనంతరం అధికారులు, అనధికారులను కలుస్తారు. 11.35 గంటలకు పైలాన్‌కాలనీలోని ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.05గంటల వరకు అక్కడ టర్బైన్ మరమ్మతుల పనులను పరిశీలించి జలవిద్యుత్ ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం 12.05 నుంచి గంటల నుంచి మ ధ్యాహ్నం 1గంట వరకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రధాన జలవిద్యుత్ కేంద్రం గురించి, విద్యుత్ ఉత్పత్తి వివరాలను గురించి తెలుసుకుంటారు. 1.05 గంటలకు హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడ జెన్‌కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టీఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్వద్ధామరెడ్డి



ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అశ్వద్ధామరెడ్డి

కనగల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్వద్ధామరెడ్డి డిమాండ్ చేశారు. కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లా యాదగిరిగుట్ట, మిర్యాలగూడ, కోదాడ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, దేవరకొండ, నల్లగొండ డిపోలకు చెందిన కార్మికులతో తెలంగాణ మజ్దూర్ యూనియర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాన్ని ఆయన హాజరయ్యారు. సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. పని గంటలు, ఆలస్యపు డ్యూటీలు, సెలవుల తదితర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు కార్మికులు వివరించారు. అనంతరం అశ్వద్ధామరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. సంస్థను కాపాడేది కార్మికులేనని గుర్తించాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీఎంయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శంకర్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా నిలబడి డిమాండ్లను సాధించుకోవాలన్నారు. అనంతరం సంఘం నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర కార్యదర్శులు శ్రీదేవి, రాజలింగం, శ్రీనివాస్, సంఘం నాయకులు ఎంపీరావు, సత్యనారాయణ, చంద్రకళ, సుజాత, మల్లేష్, నిరంజన్ పాల్గొన్నారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాల్వకు వెంటనే నీరు విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు ఇంకిపోతున్నాయని, చెరువులు, బావుల్లో నీరు ఎండిపోతోందన్నారు. బోర్లు కూడా తగ్గిపోయాయని అన్నారు. వానాకాలం సీజన్‌కు సమాయత్తమైన రైతులు నారుమళ్లు పోశారని తెలిపారు. బోరు, బావుల్లో నీరు సక్రమంగా లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాల పరిరక్షణ, నారుమడుల సంరక్షణకు ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రంగారెడ్డి కోరారు. చెరువులు, కుంటలను కాల్వ నీటితో నింపి భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలని కోరారు. సాగర్ ప్రాజెక్టులో మొదటి పంటకు సరిపడా నీరు ఉన్నందున అధికారులు వానాకాలం పంటకు నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసాను పూర్తి స్థాయిలో విడుదల చేసి వానాకాలం పంటకు రైతులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి రాంమూర్తి, మూడావత్ రవినాయక్, అప్పారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి : ఎస్పీ

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు

నల్లగొండ క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లాలోని చింతపల్లి, దేవరకొండ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు రాజారాంనాయక్, రవినాయక్‌లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వారికి పట్టీలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని అన్నారు. పోలీస్‌శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పనిచేయాలని సూచించారు.

మూసీ కాల్వలకు నేడు నీటి విడుదల

(ఆంధ్రజ్యోతి-భానుపురి,కేతేపల్లి)



మూసీ ఆయకట్టులో వానాకాలం సాగుకోసం నేడు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. నార్లుపోసి, దుక్కులు దున్ని ఒడ్డు, వరం పెట్టి నీటి కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు మురిసిపోనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల బోరుబావుల కింద వరినాట్లు వేశారు. వర్షాలు పడతాయని ఎదురుచూస్తున్న రైతాంగం ఆశలు అవిరయ్యే పరిస్థితి దాపురించిన తరుణంలో మూసీ ప్రాజెక్టు ఆదుకోనుంది. మూసీ ఆయకట్టు కింద ఉన్న మూడు నియోజకవర్గాల్లో సాగునీటి సమస్య తీరనుంది. ఈ వానాకాలం సీజన్‌లో 30వేల ఎకరాలకు నాలుగు విడతల్లో నీటి విడుదల చేయనున్నారు. మినుములు, పొద్దుతిరుగుడు, వేరుశనగకే వాడాలని నిబంధన ఉన్నా కొన్నేళ్లుగా అంతటా వరి సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి ఊరేగింపు

చింతపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు రావాలని కోరుతూ గొడకొండ్ల గ్రామ వేణుగోపాల స్వామి ఆలయంలో రెండు రోజులుగా ఊరేగింపు నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయంలో విష్వక్సేన పూజ, పంచామృతాభిషేకం, వివిధ రకాల పూలతో సహస్రనామ పూజలు వైభవంగా చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్వాల జంగయ్య, ప్రధానార్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు డిపో పరిధిలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు తెలిపారు. గురువారం దేవరకొండ నుంచి పర్వేదుల, పెండ్లిపాకల, అజ్మాపురం మీదుగా మిర్యాలగూడకు బస్సును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సైదులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సర్వం సిద్ధం

» ఉమ్మడి పీఏ పల్లి మండలంలో 80 వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు » గ్రామాల్లో వెంటాడుతున్న స్థల సమస్య

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి మండలవ్యాప్తంగా 80 వేల మొక్కలు నాటాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మొక్కలు నాటేందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో వనమహోత్సవానికి సర్వం సిద్ధం చేశారు.



పెద్ద అడిశర్లపల్లి నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఏఏ మొక్కలు అంటే..

ఎరువులు, ఎర్రమట్టితో మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుకూలంగా పూల మొక్కలు టెకోమా, గనేరు, పండ్ల మొక్కలు జామ, నేరేడు, సీతాఫలాలు, వేప మొక్కలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పెంచుతున్నారు. మొక్కలు నాటేందుకు స్థలాల సమస్య నెలకొన్నది. పలుగ్రామాల్లో ప్రభుత్వ భూములు ఎక్కడా ఖాళీ లేకపోవడంతో మొక్కలు నాటడం సమస్యగా మారింది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్థలాలను అధికారులు గుర్తిస్తున్నారు.

గుట్టల ప్రాంతంలో ఎక్కువ శాతం

మండలంలో అటవీ, గుట్టల ప్రాంతాల్లో హరితాహారం మొక్కలు నాటి లక్ష్యం చేరేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. మొక్కల కోసం స్థలం సమస్యతో రోడ్లకు ఇరువైపులా ఇదివరకే నాటిన చెట్ల మధ్య మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్నారు.

లక్ష్యం మంచిదే..



గత ప్రభుత్వం హరితాహారం పేరుతో రూ. కోట్లు ఖర్చు చేసి మొక్కలు నాటారు. లక్ష్యం మంచిదే కానీ రోడ్ల వెంట నాటే సమయంలో విద్యుత్ వైర్ల కింద నాటడంతో రెండేళ్ల తర్వాత చెట్లుగా మారి పెద్దగా అవడంతో వైర్ల కింద ఉన్నాయంటూ విద్యుత్‌శాఖ అధికారులు వాటిని తొలగిస్తున్నారు. .పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి.

\- షేక్ గాలిబ్, అంగడిపేట ఎక్స్‌రోడ్డు

లక్ష్యాన్ని చేరుకుంటాం

ఉమ్మడి మండలంలో 31 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నాం. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాల సమస్యగా మారింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మండలంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం.

చంద్రమౌళి, ఎంపీడీవో, పీఏపల్లి

సమాచారం

వేములపల్లి ఎంపీడీవోగా జితేందర్‌రెడ్డి



వేములపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేములపల్లి ఎంపీడీవోగా దండ జితేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన శారదాదేవి బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వెళ్లగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జితేందర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేయడంతోపాటు మండల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

చింతపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకటంపేట (తీదేడు), గొడకొండ్ల, తదితర గ్రామాల్లో మిషన్‌భగీరథ జలాలు నిత్యం సరఫరా కావడం లేదు. దీంతో స్థానికులు నీటి కోసం ఆటో, ట్రాక్టర్ ట్యాంకులను ఆశ్రయిస్తున్నారు. పైపుల మరమ్మతుతో పాటు, మోటార్ పనిచేయకపోవడంతో నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

కొండమల్లేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కేజీబీవీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఉషారాణి విద్యార్థినులకు ఆరోగ్య సంరక్షణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే హ్యాండ్‌వాష్, వంటగది పరిసరాలు, ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎ డాక్టర్ రసూల్, ప్రిన్సిపాల్ సరళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో బీజేవైఎం నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రాంచందర్‌రావును బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల అజయ్ గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపినట్లు అజయ్ చెప్పారు. ఆయన వెంట బీజేవైఎం జిల్లా నాయకుడు మేకల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిసన్నిధిలో వరుణ హోమం



కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు, ట్రస్టు సభ్యులు

చింతపల్లి,జూలై 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురువాలని కోరుతూ మండలకేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గణపతి ప్రార్థన దీక్షాబంధన, సాయినాథునికి సహస్రజలాభిషేకం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమాలకు నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మాచర్ల, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య,గోశాల ఇన్‌చార్జి పుల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విదేశీ విద్యను ప్రోత్సహించడం హర్షణీయం

మిర్యాలగూడ టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులను విదేశీ విద్యకు ప్రోత్సహించడం గొప్ప విషయమని కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద కేటాయించిన 210 సీట్లను 500లకు పెంచడం హర్షణీయమన్నారు. గురుకుల భవనాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూసేందుకు చర్యలు చేపట్టిన రేవంత్ సర్కార్, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తుందన్నారు. ఇందిరా శక్తి పథకం ద్వారా మహిళలకు రుణాలందించడం ఆదర్శనీయమన్నారు. అన్నివర్గాలను అక్కున చేర్చుకుంటున్న కాంగ్రెస్ రానున్న అన్ని ఎన్నికల్లో గెలుపొందడం ఖాయం అన్నారు. సమావేశంలో నాయకులు ఏగిల లక్ష్మీఅమృతం, తాళ్లపల్లి నర్సయ్య, కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, టీ. సీతయ్య, ఆర్. లక్ష్మణ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం : ఎమ్మెల్యే బాలునాయక్



రైతులకు స్ప్రింక్లర్లు, పైపులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూక్ష్మసేద్యం పరికరాలను గురువారం రైతులకు పంపిణీచేసి మాట్లాడారు. నియోజకవర్గంలో 18 మంది లబ్ధిదారులకు 18 సెట్లు పైపులు, స్ప్రింక్లర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారన్నారు. ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతు భరోసా, సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో రైతులకు 900 వరకు స్ప్రింక్లర్లు పైపులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవిందు, వెంకటయ్యగౌడ్, సురేష్‌గౌడ్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై పంపిన బిల్లును యథాతథంగా ఆమోదించి చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చేవిధంగా బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వరరావు, ఎర్రవెల్లి దుర్గయ్య, ఊరిబండి శ్రీనివాస్, నక్క నాగరాజు, దేనేటి శేఖర్, సైదులు యాదవ్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

తిరుమలగిరి(సాగర్), జూలై 17 (ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులు అధికమై 108 అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవించింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి (సాగర్) మండలం తిమ్మాయిపాలెం గ్రామ సమీపంలోని సారె గూడేనికి చెందిన ముడావత్ కల్యాణికి బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పురిటినొప్పులు వచ్చాయి. 108కు సమాచారం అందించడంతో సిబ్బంది రాకేష్, గణేష్ తండాకు చేరుకుని కల్యాణిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చేరుకోగానే నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ రాకేష్ ఈఆర్‌సీపీ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ఫిజీషియన్) వైద్యురాలు డాక్టర్ నవనీతను సంప్రదించి ఆమె సూచనల మేరకు వైద్యం అందించి గర్భిణికి సుఖ ప్రసవం అయ్యేలా చూశాడు. మగబిడ్డకు జన్మనివ్వగా తల్లిబిడ్డ క్షేమంగా ఉండడంతో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.

మునిసిపల్ కార్మికులకు కిట్ల అందజేత

నాగార్జునసాగర్, జూలై17(ఆంధ్రజ్యోతి): నందికొండ మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు మునిసిపల్ కమిషనర్ గురుమూర్తి గురువారం వ్యక్తిగత రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమస్తే దినోత్సవం భాగంగా కిట్లు అందజేసినట్లు చెప్పారు. వ్యర్థాలను తొలిగించే సమయంలో కార్మికులు ఎలాంటి అంటు రోగాల బారిన పడకుండా ఉండడానికి గ్లౌజ్‌లు, బూట్లు, ప్యాంట్లు అందించినట్లు చెప్పారు.




మునిసిపల్ సిబ్బందికి అందజేసిన రక్షణ కిట్లు

సెంచరీ కొట్టిన పచ్చిమిర్చి

(5వ పేజీ తరువాయి)

పడుతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఆకులు, మండలు 10శాతం తరుగు పోగా, రవాణా ఖర్చులు కలుపుకుంటే వందకు విక్రయించాల్సి వస్తోందంటున్నారు. నేతాజీ కాయగూర మార్కెట్, రైతు బజార్లలో పచ్చి మిర్చి ధర రూ.100 ఉండగా, కూడళ్లలోని చిరు వ్యాపారులు కిలో రూ. 120(పావు కిలో రూ. 30) చొప్పున విక్రయిస్తున్నారు.

హోల్‌సేల్‌గానే కిలో రూ. 75



పచ్చి మిర్చి ధర హోల్‌సేల్‌గానే కిలో రూ.75 చెల్లించాల్సి వస్తోంది. తరుగు, ట్రాన్స్‌పోర్ట్‌తో కలిపి రూ.85 అవుతోంది. ప్రజలకు ఇబ్బంది కలగకూడదని రూ.90కే అమ్ముతున్నాం. వర్షాలు కురవక కూరగాయల పంట సాగు తగ్గింది. దీంతో అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. మిర్చి సహా అన్ని కాయగూరలు దూర ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అక్కడక్కడ వర్షాలు కురుస్తుండగా, ఆగస్టులో ధరలు తగ్గే అవకాశముంది. సుంకు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, నేతాజీ కూరగాయల మార్కెట్

ధరలు తగ్గించాలి



పావు కిలో పచ్చి మిర్చి రూ.30కి విక్రయిస్తున్నారు. మిర్చీతోపాటు ఇతర కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. దొండ, బెండ ధర రూ.50 దాటగా, బీర, చిక్కుడుకాయలు కిలో ధర రూ.80గా ఉంది. మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం అందించిన ప్రభుత్వాలు కూరగాయలు ధరలు అమాంతం పెరగ్గా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. ధరలు నియంత్రించాలి. ఆర్.దేవమణి, గృహిణి, మిర్యాలగూడ.

పరిషత్ ఎన్నికలపైనే నజర్

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నిర్ణయిస్తే, స్థానాల కేటాయింపును కలెక్టర్ నేతృత్వంలో ఖరారు చేస్తారు. ఎంపీటీసీ స్థానాలకు కోటాను కలెక్టర్ల నేతృత్వంలో ఖరారు చేస్తే, స్థానాల కేటాయింపును ఆర్డీవోల నేతృత్వంలో ఖరారు చేయాల్సి ఉంటుంది. 2011 ఆధారంగా జిల్లాలో ఆయా మండలాల్లో ఏ రిజర్వేషన్ వస్తుందనే అంశంపై ఇప్పటికే రాజకీయనాయకులు తమ తమ అంచనాలతో లెక్కలు వేసుకుంటున్నారు. జడ్పీచైర్మన్ పదవి ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే అంశంపైనా ఆ పదవిని ఆశించే వివిధ సామాజికవర్గాలకు చెందిన కీలకనాయకులు చర్చలు జరుపుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ పదవులు ఆశించే మండలస్థాయి నాయకులు తమకు రిజర్వేషన్ల అదృష్టం ఏమేరకు సహకరిస్తుందోననే ఎదురు చూపులో ఉన్నారు.

రిజర్వేషన్లు తేలితే బరిలో దిగేందుకు నాయకులు రంగం సిద్ధం చేసుకొని ఉండడంతో అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ కొనసాగుతోంది. ఈనెలాఖరులోగా రిజర్వేషన్లు ఖరారవుతాయనే అంచనా ఇటు రాజకీయవర్గాల్లో, అటు అధికారవర్గాల్లో నెలకొంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

● ఆప్కాబ్ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యడవల్లి విజయేందర్‌రెడ్డి

హాలియా, జూలై17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలెం, రామడుగు గ్రామాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూట కట్టుకుందని ఆరోపించారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ఉర్లగొండ వెంకటయ్య, చేగొండి కృష్ణ, మజ్జిగ వెంకట్‌రాంరెడ్డి, పిల్లకంటి శ్రీనివాస్, కాట్నం నాగరాజు, ఇన్నబోయిన నాగరాజు, జక్కల శ్రీనివాస్, చక్ల రమేష్, కాట్నం నాగరాజు, గౌరు సాయి, వెంకన్న, నర్సిరెడ్డి, లక్ష్మయ్య, రాజుపాల్, నాగరాజు, లింగయ్య పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



హాలియా : విద్యార్థులకు నోట్‌బుక్స్, షూ పంపిణీ చేస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

హాలియా, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు దాతలు సాయం చేయడం అభినందనీయమని ఎంఈవో గుండా కృష్ణమూర్తి అన్నారు. మండలం హజారిగూడెం(రత్న తిరుపతి) ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు జానపాటి వెంకటేష్, జానపాటి శేఖర్, జానపాటి భాస్కర్ సాయంతో ఏర్పాటు చేసిన షూ, నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్స్, సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం దాతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంల మాజీ సర్పంచ్ షేక్ జబీన్ జలీల్ పాషా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యం.ప్రకాష్, హెచ్‌ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయురాలు దివ్యశ్రీ, సీఆర్‌పీ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, విజయలక్ష్మి, మోదాల ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

డిండి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత కుకుడాల రాములు ఆయన భార్య శంకరమ్మ జ్ఞాపకార్థం టై, బెల్టులు గురువారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు సుమారు రూ.15వేల విలువజేసే టై, బెల్టులు అందజేశారు. దాతను ఉపాధ్యాయులు సన్మానించారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మరిచిపోయిన ఆభరణాలు అందజేత



ఆభరణాల సంచిని అందజేస్తున్న ఎస్ఐ ప్రసాద్

పెద్దవూర, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన ఆభరణాల సంచిని గురువారం పోలీసులు బాధితులకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పర్వేదుల గ్రామానికి చెందిన వేముల సింహాచలం, కనకయ్య దంపతులు మిర్యాలగూడలో ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లడానికి గురువారం ఉదయం గ్రామంలో ఆటో ఎక్కి పెద్దవూరలో దిగారు. అయితే వాళ్ల ఆటో దిగే తొందరపాటులో వారి వెంట తెచ్చుకున్న ఆభరణాల సంచిని ఆటోలోనే మరిచిపోయారు. ఆ సంచిలో 2.5 తులాల బంగారు ఆభరణాలు, 17 తులాల వెండి పట్టీలు, మెట్టెలు, చిన్న ముక్కుపుడక ఉంది. వెంటనే దంపతులు తేరుకొని పెద్దవూర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పెద్దవూర ఎస్ఐ ప్రసాద్ సీసీ కెమెరాలను పరిశీలించి దంపతులు ఎక్కిన ఆటోను గుర్తించి చింతపల్లి మీదుగా హైదరాబాద్ వెళ్తున్నట్లు గుర్తించారు. చింతపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పెద్దవూర పోలీసులను అక్కడికి పంపించి ఆటోను మాల్ పట్ట ణం వద్ద ఆపి పెద్దవూరకు తీసుకొచ్చారు. అనంతరం బంగారు, వెండి ఆభరణాలను సింహాచలం, కనకయ్య దంపతులకు అప్పగించారు. ఆభరణాల సంచిని గంటల వ్యవధిలోనే బాధితులకు అప్పగించడంపై పలువురు పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఇద్దయ్య, సిబ్బంది కిషన్, లోకేష్‌రెడ్డి, రాజు, వెంకన్న, శ్రీకాంత్, సైదిరెడ్డి, హుస్సానాయక్ తదితరులు ఉన్నారు.